RNI TITLE CODE: 16425 www.andhrapragathi.com

ప్రతి అక్షరం ప్రజాహితం

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి నూతనంగా ప్రారంభించబడి అత్యంత ప్రజాదరణ పొందుతున్న తెలుగు దినపత్రిక ఆంధ్రప్రగతిలో పనిచేసేందుకు ఉత్సాహవంతులైన పాత్రికేయులను ఆహ్వానిస్తున్నాము.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, మండల రిపోర్టర్లు కావలెను. (కొత్తవారికి అవకాశం కల్పించబడును)

సెల్: 8121133006 9494220260

సంపుటి - 02 సంచిక - 11 పేజీలు - 05 వెల - 04/- శనివారం 5 అక్టోబర్ 2024

# అయిదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్



## తిరుమల లడ్డూ కల్తీ వివాదంపై విచారణ.. స్వతంత్ర సిట్ కు సుప్రీంకోర్టు ఆదేశం

- సిట్ విచారణపై ఎలాంటి సందేహాలు లేవన్న సొలిసిటర్ జనరల్
- సీబీఐ డైరెక్టర్ పర్యవేక్షణలో ఐదుగురు సభ్యులతో స్వతంత్ర సిట్ ఏర్పాటు

ఢిల్లీ: / అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీకి కల్తీ నెయ్యి వినియోగించారన్న ఆరోపణల అంశంపై సుప్రీంకోర్టు అయిదుగురు సభ్యులతో విచారణ కమిటీ వేయాలని అదేశించింది. దీనిలో సీబీఐ నుంచి ఇద్దరు, ఏపీ ప్రభుత్వం తరపున ఇద్దరు,ఎఫ్ఎస్ఎస్ఏఐ నుంచి ఒకరు సభ్యులుగా ఉండాలని సూచించింది. కోట్లమంది భక్తుల మనోభావాలతో ముడిపడిన ఈ వివాదంపై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక విచారణ జరిపించాలని కోరుతూ మాజీ ఎంపీ సుబ్రహ్మణ్యస్వామి, వైసిపి ఎంపీ వైవీ సుబ్బారెడ్డి, విక్రమసంపత్ అనే భక్తుడు, సుదర్శన్ టీవీ ఎడిటర్ సురేష్ ప్రజాప్రయోజన వ్యాజ్యాలు దాఖలు చేశారు. దీనిపై ఈ సోమవారం విచారణ జరిగింది.. అనంతరం ఆ విచారణ నేటికి వాయిదా పడింది. నేడు జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ కేవీ విశ్వనాథన్లతో కూడిన ధర్మాసనం దీనిని విచారించింది. . ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల ఏర్పాటుచేసిన ప్రత్యేక దర్యాప్తు బృందాన్నే (సిట్) కొనసాగించాలా? లేదంటే ప్రత్యేక స్వతంత్ర దర్యాప్తు సంస్థను ఏర్పాటు చేయాలా అన్న అంశంపై కేంద్రం తరపున అభిప్రాయం చెప్పాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాకు సూచించింది. దీంతో కేంద్ర ప్రభుత్వం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా తన అభిప్రాయాన్ని సుప్రీంకోర్టుకు తెలిపారు. "మొత్తం అంశాన్ని పరిశీలించాను. సిట్ సభ్యులపై ఎలాంటి సందేహాలు లేవు. వచ్చిన ఆరోపణల్లో నిజం ఉంటే ఆమోదయోగ్యం కాదు. తిరుమల శ్రీవారికి దేశవ్యాప్తంగా భక్తులున్నారు. సీనియర్ కేంద్ర అధికారి పర్యవేక్షణ ఉంటే మరింత విశ్వాసం పెరుగుతుంది" అని చెప్పారు. అనంతరం స్వతంత్ర సిట్ ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.



2లో

## ఏపీ మహిళలకు దసరా కానుక

ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాని ప్రభుత్వం అడుగులు

మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం

ఈ నెల 10న చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం!

## చంద్రబాబు నిజస్వరూపాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది

- తిరుపతి లడ్డూ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు
- స్వతంత్ర సిట్ వేయాలన్న అత్యున్నత న్యాయస్థానం
- టీడీపీ రాజకీయ దుర్బుద్ధినికోర్టు అర్థం చేసుకుందన్న జగన్



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంలో సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో... మాజీ ముఖ్యమంత్రి, వైసీపీ అధ్యక్షుడు జగన్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. చంద్రబాబు నిజస్వరూపాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపిందని అన్నారు. రాజకీయ దుర్బుద్ధితో ఎలా రెచ్చగొడుతున్నారో సుప్రీంకోర్టు అర్థం చేసుకుంది కాబట్టే... దేవుడ్ని రాజకీయాల్లోకి లాగొద్దు, రాజకీయ డ్రామాలు చేయొద్దు అని స్పష్టమైన వ్యాఖ్యలు చేసిందని వివరించారు. చంద్రబాబు స్వయంగా వేసుకున్న సిట్ ను సైతం రద్దు చేసిందని తెలిపారు. లడ్డూలో జంతు కొవ్వు కలిసిందని ఆరోపించడం ద్వారా చంద్రబాబు తిరుమల పవిత్రతను, స్వామివారి విశిష్టతను మంటగలిపాడని, కోర్టులు సైతం చంద్రబాబుకు మొట్టికాయలు వేశాయని విమర్శించారు. కోట్లాది భక్తుల మనోభావాలను దెబ్బతీస్తూ చంద్రబాబు పద్ధతి ప్రకారం అబద్ధాలు ఆడాడని, చంద్రబాబు స్వయంగా నియమించుకున్న టీటీడీ ఈవోనే చంద్రబాబు మాటలకు విరుద్ధంగా లడ్డూలపై ప్రకటన చేశాడని జగన్ వెల్లడించారు. ఇన్ని ఆధారాలు కనిపిస్తుంటే ఎవరైనా కొద్దో, గొప్పో సిగ్గుపడతారని... దేవుడి విషయంలో ఇలా తప్పుడు ప్రచారం చేస్తున్నందుకు భయం, భక్తి ఉన్న వ్యక్తి అయితే అతడిలో పశ్చాత్తాపం అనేది రావాలని పేర్కొన్నారు. ప్రజలకు క్షమాపణ చెప్పేందుకు ముందుకు రావాలని అన్నారు.**మిగతాది 2లో...**



2లో

## నందిగం సురేశ్‌కు భారీ ఊరట

టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టై జైల్లో ఉన్న సురేశ్

షరతులతో కూడిన బెయిల్ ఇచ్చిన హైకోర్టు

సురేశ్‌తో పాటు విజయవాడ మాజీ మేయర్ భర్తకు బెయిల్

## పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి

అధికారం వచ్చిన తర్వాత పవన్ లో మార్పులు

ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వ్యాఖ్యలపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ ఏఐసీసీ అగ్రనేత హుల్ గాంధీపై విమర్శలు చేయడం పెద్ద జోక్ అని విమర్శించారు. అధికారం వచ్చిన తర్వాత పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయని ఎద్దేవా చేశారు. డిప్యూటీ సీఎంగా అన్నివర్గాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. విజయవాడ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ఇవాళ(శుక్రవారం) షర్మిల మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా షర్మిల మాట్లాడుతూ... అన్ని మతాలను పవన్ కళ్యాణ్ సమానంగా చూడాలని కోరారు. ఒక మతానికే ప్రతినిధిగా పవన్ వ్యవహారిస్తున్నారని వైఎస్ షర్మిల ధ్వజమెత్తారు. ఆ వేషం వేసుకుని హిందూ మతం గురించి మాట్లాడుతున్నారని సంచలన వ్యాఖ్యలు చేశారు. పవన్ చర్యల వల్ల ఇతర మతాలను ఆచరించే వారిలో అభద్రతా భావం ఏర్పడదా అని వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ డైరెక్షన్‌లో పవన్ కళ్యాణ్ యాక్ట్ చేస్తున్నారని విమర్శలు చేశారు. ఆర్.యస్.యస్ భావజాలం బీజేపీ పాటిస్తుందని వైఎస్ షర్మిల ఆరోపించారు.**మిగతాది 2లో...**

# ఆధారాలను వెలికి తీయాలి



స్వతంత్ర దర్యాప్తు టీం ను ఏర్పాటు చేయండి

తిరుమల లడ్డూపై సుప్రీం కీలక నిర్ణయం

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతించిన సీఎం చంద్రబాబు

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: : తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో సుప్రీంకోర్టు మరోసారి సంచలన వ్యాఖ్యలు చేయడమే కాకుండా కీలక ఆదేశాలు జారీ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డు విషయంలో శుక్రవారం సుప్రీంకోర్టు విచారణ జరిపింది. ఈ సందర్భంగా దాదాపు రెండు గంటల పాటు విచారణ జరిగింది. అనంతరం సుప్రీంకోర్టు లడ్డు విషయంలో కీలక ఆదేశాలు జారీ చేసింది. తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ వ్యవహారంలో నిజానిజాలు తేల్చేందుకుగాను... స్వతంత్ర దర్యాప్తు టీం ను ఏర్పాటు చేయాలని.. స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఐదుగురు సభ్యులతో కూడిన సిట్ ను ఏర్పాటుచేసి... తిరుమల శ్రీవారి లడ్డు కల్తీ విషయంలో ఆధారాలను.. వెలికి తీయాలని స్పష్టం చేసింది. ఐదుగురు సభ్యులలో... ఇద్దరు సిబిఐ ఆఫీసర్లు ఉండాలని పేర్కొంది. అలాగే సిట్ నుంచి అంటే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఇద్దరు అధికారాలు ఉండాలని తెలిపింది. **మిగతాది 2లో...**

## తిరుమల వేంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు



తిరుమల ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: శ్రీ వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు జరగనున్న నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు తిరుమల చేరుకున్నారు. తిరుమల కొండపై పద్మావతి అతిథి గృహం వద్ద చంద్రబాబుకు మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, టీటీడీ అధికారులు స్వాగతం పలికారు. సీఎం చంద్రబాబు సతీసమేతంగా వెంకన్నస్వామికి ప్రభుత్వం తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం, టీటీడీ క్యాలెండర్లు, డైరీలు ఆవిష్కరించారు. కాగా, చంద్రబాబు శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా పెద్ద శేష వాహన సేవలోనూ పాల్గొననున్నారు.**మిగతాది 2లో...**

# ఏపీ మహిళలకు దసరా కానుక

**ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణాని ప్రభుత్వం అడుగులు**

**మంత్రివర్గ సమావేశంలో ముఖ్యమంత్రి ప్రకటించే అవకాశం**

**ఈ నెల 10న చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం!**



అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: :టీడీపీ కూటమి ప్రభుత్వం ఏపీ ప్రజలకు దసరా కానుకను ఇస్తుందా అంటే భారీగానే అని ప్రచారం సాగుతోంది. ఈ నెల 10న ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు అని అంటున్నారు. అందులో ఎన్నికల్లో ఇచ్చిన హామీలలో కొన్నింటిని అయినా దసరా నుంచి అమలు చేయడానికి సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తారు అని అంటున్నారు. మహిళలకు దసరా కానుకగా ఉచితంగా ఆర్టీసీ బస్సులలో ప్రయాణించే వరాన్ని బాబు ఇవ్వబోతున్నారు అని పెద్ద ఎత్తున ప్రచారం అయితే సాగుతోంది. మహిళలకు ఉచిత బస్సు సదుపాయం విషయం మీద మంత్రి వర్గం సీరియస్ గనే చర్చిస్తుంది అని అంటున్నారు. ఇప్పటికే ఆర్టీసీ అధికారుల బృందం కర్ణాటక, తెలంగాణా రాష్ట్రాలలో పర్యటించి వచ్చి మరీ ఒక నివేదికను ప్రభుత్వానికి అందించారు అని అంటున్నారు. ఆ నివేదిక మీద మంత్రి వర్గం కీలకమైన నిర్ణయం తీసుకుంటుంది అని అంటున్నారు. జిల్లా పరిధిలోనే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం కల్పించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయం తీసుకుంది అని అంటున్నారు. అంటే సొంత జిల్లాలో మహిళలు ఎక్కడ నుంచి ఎక్కడికి అయినా వెళ్లవచ్చు. మరి దీనికి సంబంధించి విధి విధానాలను కూడా ఖరారు చేశారు అని అంటున్నారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న వారికి ఈ చాన్స్ అని అంటున్నారు. పేదరికమే కొలమానంగా ఈ ఉచిత బస్సు సదుపాయాన్ని కల్పించాలా లేక అందరికీ అవకాశం ఇవ్వాలా అన్న చర్చ కూడా ఉంది. అదే సమయంలో కొన్ని బస్సులను మాత్రమే ఫ్రీ సర్వీస్ కోసం రిజర్వ్ చేసి పెడితే మిగిలిన బస్సులలో ఆదాయం వస్తుంది అలాగే ప్రయాణీకులు అందరూ వాటిలో ప్రయాణించేందుకు వీలు ఉంటుందని కూడా ఆలోచిస్తున్నారుట. అదే విధంగా ఈ నెలాఖరున వచ్చే దీపావళి నుంచి ఉచితంగా మహిళలకు మూడు వంట గ్యాస్ సిలిండర్లను కూడా ఇచ్చే పథకానికి ప్రభుత్వం పచ్చ జెండా ఊపింది. ఇక మహిళలు పద్దెనిమిదేళ్ళు నిండితే చాలు నెలకు 1500 రూపాయలు ఇస్తామన్న దాని మీద కూడా మంత్రి మండలి చర్చిస్తుందని అయితే అది మాత్రం ఇపుడే కాదని విధి విధానాలు పూర్తిగా రూపొందించిన మీదటనే నిర్ణయం తీసుకుంటారు అని అంటున్నారు. అదే విధంగా రైతులకు ఏడాదికి ఇరవై వేల రూపాయలు ఇచ్చే పథకాన్ని కూడా పీఎం కిసాన్ పథకంతో జత చేయడం ద్వారా ఆరు వేల రూపాయల భారాన్ని తగ్గించుకుంటూ మిగిలిన మొత్తానికి విడతల వారీగా అందచేయడానికి చూస్తున్నారని చెబుతున్నారు. ఈ పథకాన్ని సంక్రాంతికి అమలు చేసే విషయం కూడా మంత్రి మండలి సమావేశంలో చర్చిస్తారు అని అంటున్నారు. ఇక తల్లికి వందనం పథకం అయితే వచ్చే ఏడాది నుంచి అమలు చేయాలని అనుకుంటున్నారు. ఏది ఎమైనా టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి ఏడాది అయ్యేలోపుగా ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అన్నీ అమలు చేయాలని పట్టుదలగా ఉన్నారని అంటున్నారు. వైసీపీ నుంచి ఏ ఒక్క విమర్శ రాకుండా ఈ పథకాలను అమలు చేసి తమ సత్తా నిరూపించుకోవాలని టీడీపీ కూటమి చూస్తోంది అని అంటున్నారు. మొత్తానికి ఫ్రీ బస్సు పథకం కనుక దసరాకు అమలు అయితే మహిళలకు పెద్ద బహుమతే బాబు ఇస్తున్నట్లుగా భావించాలి అని అంటున్నారు.

# నాడు నారా లోకేష్ కు తమ గోడు చెప్పుకున్నారని కక్షగట్టారు.!

**-భర్తను కోల్పోయిన మహిళను వేధించారు.-మంజూరైన ఇంటిని తొలగించారని ఓ బాధితురాలు ఆవేదన.**

**-బ్రతుకుదెరువుకోసం పోతే భూమిని కబ్జాచేశారంటూ బాధితుడు ఫిర్యాదు.-నామినేటెడ్ పదవులకోసం పోటెత్తిన నేతలు.**

**-అర్జీలు స్వీకరించిన మంత్రి ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు, ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డి.**



ఆంధ్ర ప్రగతి మంగళగిరి అక్టోబర్4: కానిస్టేబులైన తన భర్తను ధారుణంగా చంపడంతో యువగళం పాదయాత్రలో నేటి మంత్రి నారాలోకేష్ ను నాడు కలిసి తమ గోడు చెప్పుకున్నందుకు.. అప్పటి నాయకులు, పోలీసు అధికారులు తమను ఎస్పీ ఆఫీసుకు పిలిపించి లోకేష్ ను ఎందుకు కలిశారంటూ నిలదీసి తమపై కక్షగట్టి తన భర్తకు రావాల్సిన బెన్ఫిట్స్ రూ. 30 లక్షల ఎక్స్ గ్రేషియా.. స్పెషల్ కేసు కింద పరిగణించి కల్పిస్తామన్న ఉద్యోగం ఇవ్వకుండా అడ్డుకున్నారని తనకు న్యాయం చేసి ఆదుకోవాలని నంద్యాలకు చెందిన శ్రావణి నేతల మందు వాపోయారు. రాష్ట్ర మైనారిటీ సంక్షేమ న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లాశ్రీనివాసరావు, ఎమ్మెల్యే జయనాగేశ్వర్ రెడ్డిలు వినతిని స్వీకరించి న్యాయం చేస్తామని మహిళకు భరోసా కల్పించారు. వచ్చిన అర్జీ దారులనుండి వినతులు స్వీకరించారు. అనంతపురం టౌన్ కు చెందిన కృష్ణవేణి విజ్ఞప్తి చేస్తూ.. గత టీడీపీ గవర్నమెంట్ లో తమకు టీడ్కో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు మంజూరు అవ్వగా.. అనంతపురం మున్సిపల్ కార్పొరేషన్ ద్వారా ప్రభుత్వానికి రెండు విడతల్లో రూ. 50 వేలు కట్టామని.. తరువాత ప్రభుత్వం మారడంతో.. తమకు ఇళ్లు మంజూరై డబ్బులు కట్టిన ఇంటిని కూడా రాకుండా చేశారని.. తమకు డబుల్ బెడ్ రూమ్ హౌస్ ఇప్పించి ఆదుకోవాలని ఆమె వేడుకున్నారు. అల్లూరి జిల్లా ముంచింగిపుట్టు మండలం దొరగూడ గ్రామానికి చెందిన సర్పంచ్ లక్షణ్, అలాగే కించాయి పుట్టు పంచాయతీకి చెందిన పలువురు గిరిజనలు నేడు గ్రీవెన్స్ కార్యక్రమానికి వచ్చి తమ గ్రామంలో విద్యుత్ సౌకర్యం, రహదారి సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన గర్భిణీలను ఆసుపత్రికి తీసుకెళ్లాలంటే కూడా దారిలేకపోవడంతో ప్రాణాలు పోతున్నాయని దయచేసి రహదారి, విద్యుత్ సౌకర్యం కల్పించాలని వారు కోరారు.కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం వెల్దుర్తికి చెందిన కటక భీబి నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేస్తూ.. తమకు వారసత్వంగా వచ్చిన భూమిని ఆన్ లైన్ లో తమ పేరుమీద ఎక్కించమని అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడంలేదని.. కావున దయతలచి తమ భూ సమస్యను పరిష్కరించాలని ఆమె విజ్ఞప్తి చేశారు.

ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం నియోజకవర్గం సుంకేసుల గ్రామానికి చెందిన పానుగంటి రంగయ్య విజ్ఞప్తి చేస్తూ.. వెలుగొండ ముంపు గ్రామాల్లో తమకు నష్టపరిహారం అందకుండా చేస్తున్నారని... గత 15 ఏళ్లుగా పోరాడుతున్నా పరిహార లిస్ట్ లో తమ పేరు మాత్రం రావడంలేదని అధికారులు చర్యలు తీసుకుని పరిశీలించి నష్టపరిహారం వచ్చేలా చూడాలని నేతలను కోరారు.విజయవాడ భవానీపురానికి చెందిన ఎం . సలోమీ తో పాటు పలువురు వరద బాధితులు గ్రీవెన్స్ కు వచ్చి తమకు వరద పరిహారం అందలేదని కలెక్టరేట్ కు వెళితే పట్టించుకోకపోవడంతో.. గ్రీవెన్స్ కు వచ్చామని చెప్పడంతో వెంటనే మంత్రి ఫరూక్ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తో ఫోన్ లో మాట్లాడి సమస్యను తెలిపి సమస్య పరిష్కారానికి కృషి చేశారు. బాధితులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపి వెళ్లారు.

కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలానికి చెందిన సూర్యరావుపేట మాజీ గ్రామ సర్పంచ్ విజ్ఞప్తి చేస్తూ.. మత్స్యకారులైన నిరుపేదలకు ఇచ్చిన భూమిలో మట్టి ఫిల్లింగ్ బిల్లులు రాలేదని.. అలాగే గ్రామంలో రామాలయం, స్కూల్ , బ్రిడ్జి కొరకు దాదాపు రూ. 15 లక్షల వరకు ఖర్చు పెట్టానని.. అవి అన్నీ బయట వడ్డీలకు తెచ్చి ఖర్చు పెట్టానని తాను ఇప్పుడు అప్పుల్లో ఉన్నానని.. తనకు రావాల్సిన డబ్బులు ఇప్పించి తన కొడుకు చదవుకు సాయం చేయాలని వేడుకున్నాడు.

తమ తండ్రికి ప్రభుత్వం 1979 లో ఇచ్చిన అసైన్ మెంట్ భూమి వేరోకరి పేరుమీదకు మారిందని.. రైతు భరోసాకు ధరఖాస్తు చేయగా ఆవిషయం తెలిసిందని తమ భూమి తమకు ఉండేలా చూడాలని అనకాపల్లి జిల్లా నర్సీపట్నం మండలం అమలాపురం పంచాయతీకి చెందిన రేళ్ళ జగ్గారావు అతని కుటుంబ సభ్యులు నేడు గ్రీవెన్స్ లో విజ్ఞప్తి చేశారు.తాము బ్రతుకుదెరువుకోసం వలస వెళితే తమ భూమిని కబ్జా చేశారని.. కబ్జాదారులు దస్తగిరి, జమ్మన్న, కేశన్న, తిరుమల కేశన్న ల నుండి తమ భూమిని విడిపించి న్యాయం చేయాలని కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం ఆలువాల గ్రామానికి చెందిన పారె ప్రవీణ్ వాపోయాడు.

తాము టీడీపీకి అనుకూలంగా ఉండటంతో టీడీపీ అధికారం పోయాక తమ ఇంటి స్థలాన్ని వైసీపీ నేతలు ఆక్రమించారని.. తాను డయాలసిస్ పేసెంట్ నని తన ఇంటి ఆక్రమణను వైసీపీ నేతలనుండి తొలగించి తనకు తన బిడ్డకు న్యాయం చేయాలని.. అలాగే తనపై ఉన్న అక్రమ కేసులు తొలగించాలని గుంటూరు జిల్లా తాడికొండ మండలం కర్లపూడికి చెందిన వెంకాయమ్మ నేతలను కలిసి విజ్ఞప్తి చేశారు. ఏలూరు జిల్లా కామవరపుకోట పంచాయతీలోని గిరజనులైన నాయక్ తెగకు చెందిన వారికి %ూ% కుల సర్టిఫికేట్లు ఇవ్వకుండా అధికారులు ఇబ్బంది పెడుతున్నారని వారి సమస్యను పరిష్కరించి న్యాయం చేయాలని కామవరపుకోట టీడీపీ నాయకులు నేడు గ్రీవెన్స్ లో అర్జీ అందించారు.

గత ప్రభుత్వం చేపట్టిన రీసర్వే వలన ఉండాల్సిన భూమికంటే తగ్గించి చూపడం.. టీడీపీకి సానుకూలంగా ఉన్నారన్న నేపంతో అందాల్సిన సంక్షేమ పథకాలను తమకు ఇవ్వలేదంటూ కొందరూ టీడీపీ పార్టీ కోసం కృషి నామినేటెడ్ పదవులను ఆశిస్తూ.. పెద్దఎత్తున పార్టీ నేతలు.. ఆర్థిక సమస్యలు, సీఎంఆర్ఎఫ్ సాయం కోసం, పింఛన్ల కోసం రాగా.. వీరితో పాటు పలువురు తమ సమస్యలపై పెద్ద ఎత్తున అర్జీలు అందించారు.

## పవన్ కళ్యాణ్ వేషం, భాష మారిపోయాయి

(మొదటి పేజి తరువాయి)

జనసేన సెక్యులర్ పార్టీ అనుకున్నామని.. కానీ పవన్ కూడా ఆర్.యస్.యస్ సిద్ధాంతంతో వెళు_న్నారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. మణిపూర్‌లో క్రైస్తవులపై ఊచకోత కోస్తే పవన్ ఎందుకు మాట్లాడరని వైఎస్ షర్మిల అడిగారు. ఇతర మతాల వారు ఓట్లు వేస్తేనే పవన్ గెలిచారనే విషయం గుర్తుంచుకోవాలని అన్నారు. ఇప్పుడు ఒకే మతం అంటున్న పవన్‌ను ఇతర మతాల వారు ఆదరిస్తారా అని వైఎస్ షర్మిల నిలదీశారు. కన్యాకుమారి నుంచి కాశ్మీర్ వరకు రాహుల్ గాంధీ యాత్ర చేశారని గుర్తు చేశారు. అటువంటి నేతను... పవన్ కళ్యాణ్ విమర్శిస్తున్నారని మండిపడ్డారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ మాయ నుంచి పవన్ కళ్యాణ్ బయటకురావాలని వైఎస్ షర్మిల హితవు పలికారు.

## చంద్రబాబు నిజస్వరూపాన్ని సుప్రీంకోర్టు ఎత్తిచూపింది

(మొదటి పేజి తరువాయి)

కానీ చంద్రబాబు ఎలాంటివాడంటే... పశ్చాత్తాపం ఉండదు, దేవుడంటే భయం ఉండదు, భక్తి ఉండదు అని జగన్ వ్యాఖ్యానించారు. ఇప్పటికీ టీడీపీ తన సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తూనే ఉందని మండిపడ్డారు. "నాకు ధర్మారెడ్డి బావ అంట... కరుణాకర్ రెడ్డి మామ అంట... టీడీపీ ట్వీట్ చూస్తే ఆశ్చర్యం వేస్తోంది. సుప్రీంకోర్టు చంద్రబాబు మీద అక్షింతలు వేస్తే... జగన్ పాపం పండిందని, జగన్ పై సుప్రీంకోర్టు సీరియస్ అని ట్వీట్ చేశారు. అబద్ధాలు చెప్పడానికి మనుషులు ఏ స్థాయికి దిగజారుతారో అనిపిస్తుంది. మనిషన్నాక దేవుడంటే భయం, భక్తి ఉండాలి... చంద్రబాబును సుప్రీంకోర్టు ఆక్షేపించిందన్న విషయాన్ని జాతీయ మీడియా మొత్తం కథనాలు ఇచ్చింది... అందరూ ఈ విధంగా చంద్రబాబును తిడుతున్నా గానీ... టీడీపీ సోషల్ మీడియా దాన్ని కూడా వక్రీకరిస్తోంది" అని జగన్ మండిపడ్డారు.

## ఆధారాలను వెలికి తీయాలి

(మొదటి పేజి తరువాయి)


ఎఫ్ ఎస్ ఎస్ ఏ ఐ నుంచి కూడా ఒక నిపుణులు కచ్చితంగా ఉండాలని పేర్కొంది. మొత్తం ఐదుగురు సభ్యులతో ఈ సిట్ ఏర్పాటు కావాలని.. సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. ఇక ఈ విచారణ సిబిఐ డైరెక్టర్ పర్యవేక్షణలో.. మాత్రమే జరగాలని తెలిపింది. ఈ సిట్ విషయంలో ఎవరు జోక్యం చేసుకోకూడదు అని... స్పష్టమైన వ్యాఖ్యలు చేసింది. ఈ తిరుమల శ్రీవారి వ్యవహారం పొలిటికల్ డ్రామాగా మారాలని... తమ కోరుకోవడం లేదని సుప్రీంకోర్టు వెల్లడించడం గమనార్హం.రాజకీయంగా తిరుమలతిరుపతి లడ్డు విషయంలో వాఖ్యలు చేయొద్దు కూడా వెల్లడించింది సుప్రీం కోర్టు. ఇకతిరుమల శ్రీవారి లడ్డూ వివాద పిటీషన్ పై సుప్రీం కోర్టులో... టిటిడి తరపున సిద్ధార్థ లూథ్రా, ఏపి ప్రభుత్వం తరపున ముకుల్ రోత్గి వాదనలు వినిపించారు. టిటిడి మాజీ ఛైర్మన్, రాజ్యసభ సభ్యులు వై.వి. సుబ్బారెడ్డి తరపున కపిల్ సిబల్ వాదనలు వినిపించడం జరిగింది. సుబ్రహ్మణ్యస్వామి స్వయంగా తానే వాదనలు వినిపించారు. అయితే.. సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై వైసీపీ సంబరపడిపోతుంది. కాగా అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన ఈ తీర్పును ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు స్వాగతించారు.సిట్ (స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్) ఏర్పాటు నిర్ణయాన్ని ఆయన అభినందించారు. ఈ మేరకు, చంద్రబాబు "ఎక్స్" (ట్విట్టర్) వేదికగా స్పందిస్తూ, "తిరుపతి లడ్డూ కల్తీ వ్యవహారంపై దర్యాప్తుకు సీబీఐ, ఏపీ పోలీసులు, ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులతో కూడిన సిట్‌ను ఏర్పాటు చేస్తూ సుప్రీంకోర్టు జారీ చేసిన ఆదేశాలను స్వాగతిస్తున్నాను. సత్యమేవ జయతే. ఓం నమో వేంకటేశాయ" అని ట్వీట్ చేశారు. ఈ తీర్పు సత్యం , న్యాయాన్ని సమర్థించడంలో కీలకమైన అడుగు అని, అన్ని సంబంధిత పక్షాల సమర్థనంతో దర్యాప్తు జరగాలని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

## ఏపీ హైకోర్టులో నందిగం సురేశ్‌కు భారీ ఊరట

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4: :
టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో అరెస్టై జైల్లో ఉన్న మాజీ ఎంపీ నందిగం సురేశ్‌కు ఏపీ హైకోర్టులో భారీ ఊరట దక్కింది. బాపట్ల మాజీ ఎంపీకి హైకోర్టు ధర్మాసనం షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. నందిగం సురేశ్‌తో పాటు విజయవాడ మాజీ మేయర్ భర్తకు కోర్టు బెయిల్ ఇచ్చింది.టీడీపీ పార్టీ కార్యాలయంపై దాడి కేసుకు సంబంధించి గత నెలలో సురేశ్‌ను ఏపీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. అక్కడి నుంచి గుంటూరుకు తరలించారు. ఆయన ముందస్తు బెయిల్ కోసం హైకోర్టును ఆశ్రయించగా ఊరట దక్కలేదు. దీంతో పోలీసులు అరెస్ట్ చేసేందుకు ఆయన ఇంటికి వెళ్లగా కనిపించలేదు. ముమ్మర తనిఖీలు చేపట్టిన పోలీసులు హైదరాబాద్‌లో అదుపులోకి తీసుకున్నారు. కోర్టులో ప్రవేశపెట్టగా ఆయనకు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది.టీడీపీ కార్యాలయంపై దాడికి సంబంధించి వివరాలు సేకరించేందుకు సురేశ్‌ను తమ కస్టడీకి అప్పగించాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. కోర్టు అనుమతితో రెండు రోజులు కస్టడీలోకి తీసుకొని విచారించారు. నిన్నటితో రిమాండ్ ముగియడంతో పోలీసులు ఆయనను కోర్టులో హాజరుపరచగా, ఈ నెల 17 వరకు జ్యుడిషియల్ రిమాండ్‌ను పొడిగించింది. మరోవైపు, ఆయన దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, ఈరోజు బెయిల్ మంజూరు చేసింది.

## తిరుమల వేంకటేశ్వరుడికి పట్టువస్త్రాలు సమర్పించిన సీఎం చంద్రబాబు

(మొదటి పేజి తరువాయి)



తిరుమల శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన అనంతరం సీఎం చంద్రబాబు మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో, విదేశాల్లో ఉండే హిందువులందరికీ అభినందనలు తెలిపారు. ఈ రోజు బ్రహ్మోత్సవ కార్యక్రమాలు ప్రారంభం అయ్యాయని వెల్లడించారు.

ఈ బ్రహ్మోత్సవాలు 9 రోజులు జరుగుతాయని, స్వామివారు వివిధ రకాల వాహనాల్లో తిరుమాడ వీధుల్లో ఊరేగింపుగా తిరుగుతారని చంద్రబాబు వివరించారు. వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలను ఇక్కడికి వచ్చే భక్తులే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న హిందువులు ఒక పవిత్రభావంతో వీక్షిస్తారని పేర్కొన్నారు. కలియుగ దేవుడు, ఈ సమాజాన్ని అన్ని విధాలా ఆదుకునే దైవం వెంకటేశ్వరస్వామికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున అత్యధిక పర్యాయాలు పట్టు వస్త్రాలు, ఇతర లాంఛనాలు సమర్పించే అదృష్టం తనకు లభించిందని చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. బ్రహ్మోత్సవాలు జరిగే 9 రోజుల్లో 15 లక్షల మంది భక్తులు తిరుమల వస్తారని, వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా టీటీడీ అన్ని రకాల చర్యలు చేపడుతోందని అభినందించారు. ఇక్కడ గోవింద నామస్మరణ తప్ప మరేమీ లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది అని చంద్రబాబు పేర్కొన్నారు.

# వరద బాధితులకు అండగా పొదుపు లక్ష్మి మహిళల భారీ విరాళం

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 04:** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా తీవ్రంగా నష్టపోయిన వరద బాధితులను ఆదుకునేందుకు జిల్లా పొదుపు లక్ష్మి మహిళలు ముందుకు వచ్చారని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్రఏ2047 జిల్లా దార్శనిక పత్ర రూపకల్పనలో భాగంగా జిల్లాలోని పొదుపు లక్ష్మి మహిళలు 50 లక్షలు జమ చేసి చేసిన మొత్తంలో మొదటి దఫా 20 లక్షల రూపాయలను శ్రీశైలం శాసనసభ్యులు బుడ్డా రాజశేఖర్ రెడ్డి చేతుల మీదుగా వరద బాధితుల సహాయార్థం ముఖ్యమంత్రి సహాయనిధికి అందజేశారన్నారు. జిల్లాలోని అన్ని మండలాలలోని పొదుపు లక్ష్మి మహిళలందరూ తమ వంతు వితరణగా 50 లక్షల రూపాయల మొత్తాన్ని జమ చేశారన్నారు. ఇందులో భాగంగానే మిగిలిన 30 లక్షల రూపాయలను సీఎం సహాయనిధికి అందజేస్తున్నారని కలెక్టర్ తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల తీవ్రంగా నష్టపోయిన బాధితులకు జిల్లా తరపున దాతలు ముందుకు వచ్చి ముఖ్యమంత్రి సహాయనిధికి విరాళాలు ఇస్తున్నారని కలెక్టర్ వెల్లడించారు. ఇప్పటివరకు దాతలు విరాళాలు ఇచ్చిన మొత్తాల కంటే పేదలైన పొదుపు లక్ష్మి మహిళలు మానవతా దృక్పథంతో తమ వంతు వితరణను భారీగా సేకరించి జిల్లా తరపున ముఖ్యమంత్రి సహాయ నిధికి 50 లక్షల రూపాయలను అందజేయడం హర్షనీయమని కలెక్టర్ తెలిపారు.

# ఘనంగా విలేఖరి నరహరి పుట్టినరోజు వేడుకలు





ఆంధ్ర ప్రగతి నందా టౌన్ అక్టోబర్ 04:
నంద్యాల పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు నిర్వహించిన విలేఖరి నరహరి పుట్టినరోజు వేడుకలకు ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పాల్గొన్నారు. అనంతరం విలేఖరి నరహరి కేక్ కటింగ్ చేయడం జరిగింది.
ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ మీడియా రంగంలో దాదాపు 10 సంవత్సరాలు పైగా ఉంటూ ప్రజలకు , ప్రతినిధులకు , అధికారులకు మధ్యవర్తిగా ఉంటూ సమాచారాన్ని సేకరిస్తూ ప్రజలకు తెలియజేస్తూ తమ వంతు కర్తవ్యాన్ని నిర్వహిస్తున్న నరహరి ఇలాంటి పుట్టినరోజు వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్టు తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో నంద్యాల టిడిపి పట్టణ అధ్యక్షులు మునియార్ ఖలీల్, ఉప్పరి సురేష్ కుమార్ సైలాబ్ అలీ అక్బర్ , తోహిత్ , బషీర్ ఇమ్రాన్ ఆదిల్ , ఉస్మాన్ తదితరులు పాల్గొన్నారు.

# సనాతన ధర్మదీపికలు రామాయణ, భారత, భగవద్గీతలు

**-డాక్టర్ తొగటసురేశ్ బాబు, ధార్మికోపన్యాసకులు.**

**-ఘనంగా ముగిసిన తితిదే ధార్మిక కార్యక్రమాలు.**



ఆంధ్ర ప్రగతి తుగ్గలి అక్టోబర్ 04:
లోకాస్సమస్తాస్సుఖినోభవంతు అంటూ విశ్వకల్యాణాన్ని కాంక్షించే హిందూ సనాతన ధర్మానికి తరాలు మారినా యుగాలు గడచినా చెదరని దీపికలుగా నిలిచేవి భారత, రామాయణ, భాగవత, భగవద్గీత లేనని వాటి అధ్యయనం, ప్రవచనము నిరంతరం జరగాలని, వాటి ద్వారా వ్యక్తి, కుటుంబ, సామాజిక, దేశ ధర్మాలను తెలుసుకునే వీలు కలుగుతుందని, గోవు సకల దేవతాస్వరూపమని , గోసేవ దేవతాసేవ మాత్రమేకాక దేశసేవ అవుతుందని ధార్మిక ప్రవచకులు డాక్టర్ తొగట సురేశ్ బాబు అన్నారు. తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో కర్నూలు జిల్లా, తుగ్గలి మండలం, మారెల్ల గ్రామంలో వెలసిన శ్రీ ఆంజనేయస్వామి ఆలయం నందు గత నాలుగు రోజులుగా జరుగుతున్న ధార్మిక, ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాల ముగింపు సందర్భంగా గోపూజ మరియు కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ధార్మిక సభా కార్యక్రమంలో మూడు రోజులపాటు శ్రీమద్రామాయణం, మహాభారతం, భగవద్గీతలపై ధార్మిక ప్రవచకులు, ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ తొగట సురేశ్ బాబు చేసిన ధార్మిక ప్రవచనాలు భక్తులను ఎంతగానో అలరించాయి. ఈ కార్యక్రమంలో తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వేంకటరెడ్డి, గ్రామ సర్పంచ్ సుగుణావతమ్మ, సలహాదారులు యర్రం సుధాకర రెడ్డి, ధర్మ ప్రచార మండలి సభ్యులు ఎ.కోదండరాం, తలారి అంజి, మాజి ఎంపిటిసి ఈడిగ వెంకట రాముడు, భజన మండలి అధ్యక్షులు చాకలి పెద్దయ్య, నక్క శివశంకర్, మంకె.లింగన్న, వై.కౌలుట్ల, పి.రామాంజనేయులు, తలారి లక్ష్మీ నారాయణ, సుధాకర్, ఉపాధ్యాయులు రవీంద్రనాథ్ ఇ.ధృవమూర్తి, యం.పెద్దయ్య, భజన మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# జాబ్ మేళా ను సద్వినియోగం చేసుకోండి.

**-నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 04:
గ్రామీణ , పట్టణ ప్రాంతాల్లో ఉన్న నిరుద్యోగ యువతీ , యువకులకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా నంద్యాలలో అక్టోబర్ 8 వ తేదీ స్థానిక బొమ్మల సత్రం గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ నందు జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందని నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ తెలిపారు. ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం (రాజ్ టాకీస్) నందు జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్ ను డిస్టిక్ స్కిల్ డెవలప్మెంట్ ఆఫీసర్ శ్రీకాంత్ రెడ్డి , ప్లేస్మెంట్ ఆఫీసర్ సుబ్బన్న , స్కిన్ హబ్ కోఆర్డినేటర్ మస్తాన్ వలి , 36వ వార్డు టిడిపి ఇంచార్జ్ మారుతి తో కలిసి నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ పోస్టర్లను



రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గ మరియు చుట్టుపక్కల ప్రాంతాల నిరుద్యోగ యువతీ యువకులకు నిర్వహించిన జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలన్నారు . 4 కంపెనీలు జాబ్ మేళాలో పాల్గొనబోతున్నాయని . దాదాపు 338 ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నాయన్నారు . నిరుద్యోగులు నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని ప్రతి నెల జాబ్ మేళాను నిర్వహించడం జరుగుతుందన్నారు . 20 లక్షల ఉద్యోగాలు ఐదు సంవత్సరాలలో ఇవ్వాలనేదే తెలుగుదేశం పార్టీ ఆశయమన్నారు . ఈ ఆశయానికి అనుగుణంగా మంత్రివర్యులు నారా లోకేష్ సారథ్యంలో ఖచ్చితంగా సాధిస్తామని ప్రతి నిరుద్యోగికి ఉద్యోగ అవకాశం కల్పించే బాధ్యత తీసుకుంటామన్నారు. అలాగే నాకు తెలిసిన హైదరాబాద్ కంపెనీస్ కూడా నంద్యాలకు తీసుకుని వచ్చి జాబ్ మేళా నిర్వహిస్తామని ఈ సందర్భంగా తెలియజేశారు.

# మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 04:
జిల్లాలో మొక్కజొన్న రైతులను ఆదుకోవాలని మొక్కజొన్నకు తగిన గిట్టుబాటు ధర కల్పించాలని. అకాల వర్షాలకు తడిసిన మొక్కజొన్నను ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరుతూ సిపిఐ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో నందికొట్కూరు ఆత్మకూరు ఆళ్లగడ్డ బనగానపల్లె కోవెలకుంట్ల మహానంది మండలంలో రైతులతో ముఖాముఖిపర్యటన కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు పిలుపునిచ్చారు.
స్థానిక సిపిఐ కార్యాలయంలో. విలేఖరుల సమావేశంలో సిపిఐ జిల్లా కార్యదర్శిఎన్.రంగనాయుడు జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.బాబా ఫక్రుద్దీన్ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి సోమన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి ఎన్ రంగనాయుడు మాట్లాడుతూ. నంద్యాల జిల్లాలో మొక్కజొన్న రైతులు20 వేల హెక్టార్ ఎకరాలలో మొక్కజొన్న పంట వేయడం జరిగిందని, కానీ మొన్న కురిసిన అకాల వర్షాల వల్ల అధిక




శాతం మొక్కజొన్న పంట చేతికి రాక రైతులు ఇబ్బందులు గురైనారని వాటితో పాటు ప్రభుత్వం సరైన గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో మధ్య దళారులు రైతులు మోసిగించే పద్ధతిలో క్వింటాలు 2300 కొంటున్నారని వేసిన పంటకు తగిన గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పుల పాలవుతున్నారని మొక్కజొన్న క్వింటాల్ కు 3300 గిట్టుబాటు ధర కల్పించాలని మార్ఫ్ ఫెడ్ ద్వారా చెల్లించాలని జిల్లా కలెక్టర్ గారికి రైతులు బాధలు తెలిపేందుకు జిల్లాలో మొక్కజొన్న రైతులను కలిసి వారి ఆవేదనను తెలిపేందుకు జిల్లా పర్యటన జరుపు కొని మొక్కజొన్న రైతులతో కలిసి 7వ తేదీ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించేందుకు సన్నద్ధమవుతున్నామని ఈ కింద తెలిపిన ప్రాంతాలలో జిల్లా పార్టీ నాయకత్వం రైతులతో ముఖాముఖి కార్యక్రమం ఉంటుందని రైతులందరూ సహకరించాలని పై నాయకులుతెలిపారు.

5-10-24.
గడివేముల :ఉదయం 11 గంటలకు.
మిడుతూరు :12 గంటలకు. నందికొట్కూరు :1గంటలకు. పాములపాడు: 3. గంటలకు.
ఆత్మకూరు :4 గంటలకు.

6-10-2024.
మహానంది :10 గంటలకు. సిరివెళ్ల :11 గంటలకు.
రుద్రవరము: 12గంటలకు. చాగలమర్రి :1 గంటల కు. దొర్నిపాడు :2 గంటలకు. ఉయ్యాలవాడ :3 గంటలకు. సంజామల :4 గంటలకు. కోవెలకుంట్ల. 5 గంటలకు.
పై ప్రాంతాలలో రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరుగును. రైతులందరూ కార్యక్రమాలలో పాల్గొని తమ బాధలను ఆవేదననుతెలపవలసిందిగా పై నాయకులు తెలిపారు.

# స్వర్ణాంధ్ర@2047 జిల్లా ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం.!

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, అక్టోబర్ 04:
స్వర్ణాంధ్ర ఏ2047 ప్రణాళికలో భాగంగా రాబోయే 23 సంవత్సరాలలో నంద్యాల జిల్లా అన్ని రంగాలలో అభివృద్ధి సాధించే దిశగా ప్రణాళిక రచన సిద్ధం చేస్తున్నామని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్లోని సెంటనరీ హాలులో స్వర్ణాంధ్ర ఏ2047 జిల్లా దార్శనిక పత్ర ప్రణాళికపై అధికారులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు, వివిధ రంగాల స్టేక్ హోల్డర్స్ లతో జిల్లా స్థాయి సమీక్ష నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్, డిఆర్ఓ పద్మజ, సిపిఓ వేణుగోపాల్, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో స్వర్ణాంధ్రఏ2047 ప్రణాళిక నిమిత్తం జిల్లాస్థాయి ప్రణాళిక రూపొందిస్తున్న నేపథ్యంలో ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేట్ హోల్డర్స్ భాగస్వాములై తమ సూచనలు, సలహాలు ఇవ్వాలని పిలుపునిచ్చారు. అన్ని గ్రామాలలో గ్రామసభలు నిర్వహించి ప్రజల నుండి అభిప్రాయాలు సేకరించి మండల స్థాయి ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. జిల్లాలో ఇప్పటివరకు 60 వేల మందికి పైగా క్యూఆర్ కోడ్ స్కాన్ ద్వారా తమ యొక్క అభిప్రాయాలు పొందుపరిచాన్నారు. మానవ అభివృద్ధికి సంబంధించి ఆరోగ్యకరమైన జీవన విధానం, ఉన్నతమైన జీవన ప్రమాణాలు కలిగి ఉండడం, ఆనందంగా ఉండడం తదితర ఆరు పారామీటర్లను ఆధారం చేసుకుని ప్రపంచంలోని 193 దేశాలకు ర్యాంకింగ్ ఇస్తారని ఇందులో భారతదేశానికి 134 స్థానం ఉందన్నారు. స్వర్ణాంధ్రఏ2047 లక్ష్యసాధనతో ప్రపంచంలోనే మూడు అగ్రగామి దేశాల్లో భారతదేశం ఒకటిగా నిలపాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష ఆమె అన్నారు. రాష్ట్రంలోని నంద్యాల జిల్లాలో అపార వనరులు ఉన్నాయని వాటిని సక్రమంగా సద్వినియోగం చేసుకునేందుకు పకడ్బందీ ప్రణాళిక రూపొందించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 9.68 లక్షల హెక్టార్ల భూమిలో 33%




అడువులు ఉన్నప్పటికీ మరికొంత భాగం గ్రీనరీని పెంచుకోవాలన్నారు. 4 లక్షల హెక్టార్లలో వ్యవసాయ, వాణిజ్య పంటలు పండిస్తున్నారన్నారు. 50 వేల హెక్టార్లలో బిందు, తుంపర్ల సేద్యం ద్వారా పంటలు సాగు చేస్తున్నారన్నారు. 75 వేల హెక్టార్లలో శనగ పంటను మాత్రమే వేసి తొమ్మిది నెలలపాటు ఖాళీగా ఉంచుతున్న భూములను సాగులోనికి తీసుకురావాలన్నారు. అధిక రసాయనిక ఎరువులు వినియోగించి సారవంతం లేని భూములుగా మార్చారని సేంద్రియ ఎరువులను వినియోగించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చుకోవాలని కలెక్టర్ సూచించారు.
జిల్లాలో 6 ప్రముఖ సిమెంట్ పరిశ్రమలు ఉన్నాయని దీంతో పాటు పారిశ్రామిక రంగాన్ని మరింత అభివృద్ధి చేస్తే జిల్లా జిడిపి పెరుగుతుందన్నారు. పారిశ్రామిక రంగంలో నైపుణ్యాల కొరత ఉందని విద్యార్థి దశ నుండే ఆసక్తిగల రంగాలలో నైపుణ్యతనిచ్చి ఉపాధి మార్గాలను చూపాలన్నారు. ప్రతి ఇల్లు, వీధి స్మాల్ స్కేల్ ఇండస్ట్రీగా తీసుకురావాలన్నదే ప్రభుత్వ ఆశయమన్నారు. జిల్లాలో ఎకో టూరిజం ను టెంపుల్ టూరిజంకు అనుసంధానం చేసి ప్రకృతితో కలిసి జీవించేలా పర్యాటక రంగాన్ని అభివృద్ధి చేస్తున్నామన్నారు. ఇందుకోసం యాత్రికులకు అవసరమైన మౌలిక వసతులు ఏర్పాటుచేసి ఆదాయ మార్గాలను పెంచుకునే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. సహజంగా లభించే వనరులు అయిన సోలార్, విండ్, వాటర్ తదితర సమీకృత వనరులతో వృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లాలో 70 శాతం అక్షరాస్యత మాత్రమే ఉందని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందడంతో పాటు ఉన్న వనరులను చక్కగా సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే ఆడపిల్లలకు చిన్న వయసులోనే వివాహాలు చేయకుండా డిగ్రీ వరకు చదివించి పోటీ పరీక్షలకు సిద్ధమయ్యేలా చేయాలన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి గారి సుదీర్ఘ ఆలోచనలతో స్వర్ణాంధ్రఏ2047 రూపకల్పనకు అన్ని జిల్లాల నుంచి మండల, జిల్లా స్థాయి ప్రణాళికలను స్వీకరిస్తున్నారని కలెక్టర్ తెలిపారు. సంపన్న కుటుంబాలు వ్యక్తులు కొంతమంది నిరుపేద కుటుంబాలను దత్తత తీసుకొని జీవన ప్రమాణాలు పెంచే దిశలో ముందుకు రావాలని కలెక్టర్ సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతుందని కలెక్టర్ వివరించారు.
ఈ సమీక్షలో దాదాపు 35 మంది వ్యక్తులు తమ విలువైన సూచనలు, సలహాలు వెల్లబుచ్చారని అందరి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకొని రాబోయే 23 సంవత్సరాలలో నిర్దేశించుకున్న లక్ష్యాలు సాధించుకోవడానికి సమగ్రమైన కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ప్రభుత్వానికి నివేదిస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం జిల్లా అధికారులతో పాటు ప్రజాప్రతినిధులు, ప్రజలు, అన్ని సెక్టార్ల స్టేక్ హోల్డర్స్ సమిష్టిగా నంద్యాలను స్వర్ణ జిల్లాగా మార్చేందుకు సహకరించాలని ఆమె ఆకాంక్షించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ సి. విష్ణుచరణ్ మాట్లాడుతూ వికసిత్ భారత్ లో భాగంగా 2047 విజన్ కార్యచరణ ప్రణాళిక రూపొందించి ప్రపంచంలోని మూడు అగ్రగామి ఆర్థిక దేశాలలో భారతదేశాన్ని ఒకటిగా నిలపాలన్నదే ప్రధానమంత్రి గారి ఆశయం అన్నారు. ప్రపంచంలోనే భారతదేశం కీలకమైన పాత్ర పోషించనుందని జాయింట్ కలెక్టర్ తెలిపారు. అంతకుముందు రావినూతల దుర్గాప్రసాద్, డాక్టర్ వసుధ, దస్తగిరి, డా. యశోదర, ఇస్మాయిల్, రాజామహేంద్రనాథ్, నాగరాజు, డాక్టర్ రాజశేఖర్, నోబియా భాను, మహమ్మద్, ఉమామహేశ్వరి, జై పద్మావతి, రాంబాబు, ముత్యాల నాయుడు, రాజశేఖర్ నాయుడు ప్రమీల తదితరులు పాల్గొని తమ అమూల్యమైన సలహాలను జిల్లా స్థాయి కమిటీకి సూచించారు.

# మహానంది క్షేత్రంలో కనిపించని దసరా సందడి..!

## దసరా ఏర్పాట్లు చేయడంలో అధికారుల నిర్లక్ష్యం..?



ఆంధ్ర ప్రగతి మహానంది అక్టోబర్ 4: మహానంది క్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పచ్చదనం, పచ్చని తోరణాల అలంకరణలు ఎక్కడ కనిపించడం లేదని పలువురు భక్తులు ఆరోపిస్తున్నారు. ఇంతకు ఆలయ అధికారులు ఏ మత్తులో...? ఉన్నారని ప్రశ్నిస్తున్నారు. క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిపించడం జరుగుతుందని అదరగొట్టారు ఊదరగొట్టారు. కానీ చివరకు చేతులెత్తేసారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వీటన్నింటికీ కారణం అధికారికంగా పర్యవేక్షణలోపమా లేక వారు చెప్తే నేను వినాలా.. నాకే మీరు చెప్తారా అనే ధోరణిలో వ్యవహరిస్తున్నారా అనేది వారి అంతరాత్మకే వదిలి వేస్తున్నట్టు భక్తుల మధ్య చర్చ నడుస్తున్నట్లు తెలుస్తుంది. సాధారణంగా దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రముఖ శివాలయాలు ప్రతిష్టాత్మకంగా తీసుకొని అలంకరణ, పచ్చదనం, ప్రత్యేక పూజలు చేయడం 9 రోజుల పాటు ఎప్పటి నుండో ఆచారంగా వస్తుంది. గతంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలకు దాతలను ఆహ్వానించి 80 శాతం పైనే వారి సహకారంతోనే అంగరంగ వైభవంగా దిగ్విజయంగా భక్తుల సమక్షంలో నిర్వహించేవారు. నేడు దాతలు కరువు అవడంతో పాటు తూతూ మంత్రంగా దాతలను ప్రసన్నం చేసుకోగా ఏదో... దసరా... శరన్నవరాత్రి ఉత్సవాల మ..మా అనిపిస్తే... మాకే.. లాభం అన్నట్లు ఆలయ అధికారులు వ్యవహరిస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్న ఏమీ పట్టినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వినవస్తున్నాయి. కనీసం ఆలయ ప్రధాన గాలి గోపురాల వద్ద కానీ, క్షేత్రంలోని ప్రధాన ఆలయ ముఖ ద్వారాల వద్ద కానీ మామిడి, అరటి, పూలతో తోరణాలు కూడా ఏర్పాటు చేయలేని స్థితిలో మహానంది ఆలయ అధికారులు ఉన్నారంటే వారిని ఏమి అనాలి అనే ప్రశ్న తలెత్తినట్లు తెలుస్తుంది. తొమ్మిది రోజులపాటు హెూమశాలను సర్వాంగ సుందరంగా అరటి ,మామిడి, పూల తోరణాలతో ప్రతిరోజు అలంకరించాల్సి ఉంటుంది. గురువారం రాత్రి అలంకరించిన మంటపంలోనే అవే పచ్చ తోరణాలతో మార్చకుండా వాడిపోయిన వాటిని మార్చకుండా పూజా కార్యక్రమాలు నిర్వహించడం ఏమిటని పలువురు భక్తులు ప్రశ్నలు స్పందిస్తున్నారు. ఇది చర్చనీయాంశంగా మారినట్లు తెలుస్తుంది. శివాలయం ముందు బాగానే ఉన్నా వినాయక విగ్రహం వద్ద ఉన్న ద్వారానికి కూడా పచ్చటి తోరణాలు లేవంటే అతిశయోక్తి కాదు. అమ్మవారి ఆలయంలో మాత్రం నామమాత్రంగా అలంకరణ చేపట్టారు. ఆలయ ముందున్న ప్రధాన గాలిగోపురం శివాలయం, రామాలయం, నవగ్రహాలు,



పంచలింగాల ఆలయాలు, దక్షిణ గాలిగోపురం, వినాయక నంది ఆలయాల్లో ఎక్కడ మామిడి, పూల అలంకరణ పచ్చదనం కనిపించడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. ఒకటి అరచోట్ల అవి ఉన్న గత రెండు రోజుల క్రితం అలంకరించినట్లుగా భక్తులు భావిస్తున్నట్లు తెలుస్తుంది. ఒక విచిత్రం ఏమంటే ఎవరో భక్తులు దక్షిణ గాలిగోపురం వద్ద ద్వారానికి ఇరువైపుల మామిడి ఆకులను ఉంచి తమ భక్తిని చాటుకున్నట్లు సమాచారం. డిప్యూటీ కమిషనర్ స్థాయి ఆలయం గ్రూప్ టెంపుల్ ఆలయాన్ని కంటే తక్కువ చేసి దసరా మహా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారంటే దానికి అర్థం ఏమిటి. అన్నింటికీ సమాధానం కాలమే నిర్ణయిస్తుంది అని భక్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వరాష్ట్రంతో పాటు రాష్ట్రాల నుంచి కూడా భక్తులు మహానంది ఆలయానికి వచ్చి స్వామి అమ్మవార్ల దర్శన భాగ్యం కల్పించుకొనుచున్నారు అని అంటే దాని విశిష్టత ప్రాధాన్యత భక్తులకు తెలిసిన.. ఇక్కడ పనిచేసే అధికారులకు తెలియదా.?

# గిరిజనుల సమస్యలపై చర్యలు చేపట్టండి

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 4:**



నంద్యాల జిల్లా కలెక్టర్ ను కోరిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ ఎస్టి కమిషన్ కు ప్రజల నుంచి వచ్చిన విన్నపాల గురించి కలెక్టర్ తో చర్చించిన ఎస్టీ కమిషన్ సభ్యులు శంకర్ నాయక్. జిల్లాలో ఉన్న గిరిజనుల సమస్యలపై ప్రత్యేకంగా దృష్టి సారించి చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్ జిల్లా కలెక్టర్ రాజకుమారి ఐఏఎస్ ని వివరించారు. శుక్రవారం నంద్యాల కు వచ్చిన ఆయన జిల్లా కలెక్టర్ రాజకుమారి ని మర్యాదపూర్వకంగా కలిసి గిరిజనుల సమస్యల గురించి చర్చించారు. శ్రీశైలం ఐటీడీఏ పరిధిలో ఉన్న 48 చెంచు గుడాల్లో మౌలిక వసతులు కల్పించి, చెంచులు అభ్యున్నతికి కృషి చేయాలన్నారు. అదేవిధంగా ఆశ్రమ గురుకులాల రెసిడెన్షియల్ పాఠశాలలో విద్యాబోధన అందించేందుకు రెగ్యులర్ టీచర్లను నియమించాలని అదేవిధంగా వారి ఆరోగ్యం భద్రతపై ఏఎన్ఎం లను నియమించి, శ్రీశైలం ఐ టి డి ఏ పరిధిలోనే మూడు అంబులెన్స్ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ను విన్నవించారు. ప్రతి గిరిజన తండాలో స్మశాన వాటిక కొరకు స్థలం కేటాయించాలని అన్నారు. కొన్ని చెంచుగూడాల్లో కనీసం విద్యుత్తు సౌకర్యం లేక గిరిజనులు అవస్థలు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. గిరిజనుల కోసం జిల్లాలో గిరిజన భవన్ త్వరితగితన స్థలం మంజూరు చేసి నిర్మాణం చేపట్టాలని కోరారు. ఇప్పటికీ చాలామందికి ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు లేక ఇబ్బందులు పడుతున్నారని, అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు అందుకోలేకపోతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.జిల్లాలో గిరిజనుల సమస్యల పరిష్కారానికి స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి వారి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఆయనతోపాటు గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రవి నాయక్, డివిజన్ విజిలెన్స్ ఉంటే మానిటరింగ్ కమిటీ మెంబర్ శ్రీనివాసులు నాయక్, ఈశ్వర్ నాయక్, నగేష్ నాయక్, వాసగిరి సుంకన్న హనుమంతు నాయక్ విక్రమ్ నాయక్, మరియు గిరిజన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పోలీసు సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం.

**-సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యత.**

**-నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 4: పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారం కొరకు ఈ రోజు నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు గ్రీవియన్స్ డే నిర్వహించారు.జిల్లాలో వివిధ పోలీసు స్టేషన్లు ఆయా విభాగాలలో విధులు నిర్వర్తిస్తున్న 06 పోలీసు సిబ్బంది వారి మ్యూచువల్ ట్రాన్స్ఫర్, మెడికల్ గ్రౌండ్స్, రిక్వెస్ట్ బదిలీల గురించి జిల్లా ఎస్పీ కి స్వయంగా విన్నవించుకున్నారు. జిల్లా ఎస్పీ సిబ్బంది సమస్యలను విని, వారి సమస్యలకు తగిన పరిష్కారం చూపుతామని సిబ్బందికి భరోసా కల్పించారు. పోలీస్ సిబ్బంది సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తూ సిబ్బంది సమస్యల పరిష్కరానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని, శుక్రవారం నిర్వహించే పోలీస్ వెల్ఫేర్ డే కార్యక్రమంలో సిబ్బంది వారి సమస్యలను నిర్భయంగా తెలియజేసుకోవచ్చని జిల్లా ఎస్పీ తెలిపారు. విధినిర్వహణలో సిబ్బంది సతమత పడకుండా వారి సమస్యల తొలగించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చెయ్యటమే లక్ష్యమని తెలియచేసినారు.

# నంద్యాల గోల్డ్ షాప్ యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి



ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 04:

నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, ఆదేశాల మేరకు సీసీఎస్ ఇన్స్పెక్టర్ సురేష్ నంద్యాల 1 టౌన్ సీఐ జి .సుధాకర్ రెడ్డి ఆద్వర్యములో ఇటీవల జరుగుతున్న దొంగతనాల దృష్ట్యా నంద్యాల టౌన్ గోల్డ్ షాప్ యజమానులతో సీసీ కెమెరాల ఏర్పాటు గురించి, వాచ్ మెన్ ల నియామకము గురించి మరియు తగిన జాగ్రత్తల గురించి మీటింగ్ ఏర్పాటు జరిగినది. అదే క్రమములో దసరా పండుగ సందర్బముగా పట్టణ ప్రజలకు దొంగతనాలు, చైన్ స్నాచింగ్, పిక్ పాకెటింగ్, మోటార్ సైకల్ దొంగతనాలు మరియు ఇతర అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా కూడా కొన్ని సూచనలు చేయడమైనది. పండుగల సందర్బముగా ఇంటికి లాక్ చేసుకొని ఇతర ప్రాంతాలకు వెళ్ళేవాళ్లు తమ యొక్క డబ్బులు మరియు సొత్తు బ్యాంక్ లాకర్ లో గాని లేదా తమ వెంట గాని తీసుకొని వెళ్ళాలి. అలా వెళ్ళేవారు పోలీసు వారికి సమాచారము ఇస్తే మీ ఏరియాలో పోలీసు వారు గస్తీ ఏర్పాటు చేయడము జరుగుతుంది. బైకులు మరియు స్కూటి లు ఇంటిలో పార్క్ చేసుకొని చైన్ తో లాక్ చేసుకోవాలి.ఊరిబయటకు వాకింగ్ కు వెళ్ళేవారు ఒంటరిగా వెళ్లరాదు. సాధ్యమైనంత వరకు ఇంపార్టెంట్, కాలనీలలో సీసీ కెమెరాలు ఇన్ స్టాల్ చేసుకోవాలి. ఊర్లకు వెళ్ళేవాళ్లు బ్యాగ్స్ లలో విలువైన వస్తువులు తీసుకొని వెళ్ళేప్పుడు జాగ్రత్తగా ఉండాలి ఏమరపాటుగా ఉండరాదు.నెంబర్ ప్లేట్ లేని వాహనాలు టౌన్ లో తిరిగితే సీజ్ చేయబడతాయి.గోల్డ్ షాప్ యజామనులందరు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి.

# క్రీడాభారతి ఉచిత ఫుట్బాల్ క్యాంపు.!

**ఆంధ్ర ప్రగతి నంద్యాల టౌన్ అక్టోబర్ 4:**



నంద్యాల జిల్లా ఆధ్వర్యం లో 9 నుండి 15 సంవత్సరాల లోపు వయసుగల బాలురకు ఉచిత ఫుట్బాల్ క్యాంపు ను శుక్రవారం తేదీన సాయంకాలం 4:30 గంటలకు బాలాజీ కాంప్లెక్స్ నందలి శాంతినికేతన్ స్కూల్ ఆవరణలో నిర్వహించడం జరిగినది. ఈ కోచింగ్ క్యాంప్ ఉదయం 7 గంటల నుండి 9 గంటల వరకు సాయంకాలం 5 గంటల నుండి 7 గంటల వరకు జరుగుతుందని, ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రీడాభారతి రాయలసీమ జోనల్ అధ్యక్షులు శ్రీ రామకృష్ణారెడ్డి శాంతినికేతన్ స్కూల్ కరెస్పాండెంట్ మరియు క్రీడాభారతి నంద్యాల అధ్యక్షులు సుధాకర్ ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల సుధాకర్ పాల్గొనగా, నంద్యాల జిల్లా ఫుట్బాల్ అసోసియేషన్ మరియు క్రీడాభారతి సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిబిరంలో ఫుట్బాల్ అసోసియేషన్ నిర్వాహకులు రాజా, కిరణ్, అఖిల్ లతోపాటు సుమారుగా 40 మంది విద్యార్థులు ఈ శిక్షణకు హాజరు కావడం జరిగిందని,

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసినటువంటి పెద్దలు రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నంద్యాల పట్టణవాసులు అందరూ కూడా ఈ ఉచిత శిక్షణ శిబిరాన్నిఉపయోగించుకుని రాబోయే రోజులలో పిల్లలు గొప్ప స్థాయిలో రాణించడానికి ఈ శిక్షణ ఉపయోగపడాలని వారు ఆశ భావంవ్యక్తం చేశారు.అట్లేక్రీడాభారతి జిల్లా అధ్యక్షులు సుధాకర్ మాట్లాడుతూ మొబైల్స్ కి అడిక్ట్ కాకుండా ఈ ఆటలో మంచి ప్రావిణ్యాన్ని సంపాదించి రాబోయే రోజుల్లో ఫుట్బాల్ ఆటను. నంద్యాల నుండి జాతీయ అంతర్జాతీయ స్థాయిలో తీసుకెళ్లాలని వారు ఆకాంక్షించారు. నిమ్మకాయల సుధాకర్ మాట్లాడుతూ క్రీడాభారతి నాలుగు నెలల క్రితం నంద్యాలలో పురుడు పోసుకుని ఫుట్బాల్ ఆటతోనే మొదలు కావడం మరియు అదే ఆటకు శిక్షణ అందించడం చాలా ఆనందంగా ఉందని దీనికి సహకరించిన ఫుట్బాల్ అసోసియేషన్ నిర్వాహకులు అందరినీ వారు అభినందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో క్రీడా భారతి ట్రెజరర్ రమేష్ కమిటీ మెంబర్లు, అయినా రమణ, గోపి పీఈటీలు,కోచులు మొదలు వారు పాల్గొనడం జరిగింది.

# పార్టీ శ్రేణులతో జగన్మోహన్ రెడ్డి వరుస సమావేశాలు

## రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చ

అమరావతి, ఆంధ్ర ప్రగతి అక్టోబర్ 4:

వైసీపీ అధ్యక్షులు జగన్మోహన్ రెడ్డి గత మూడు రోజులుగా పార్టీ శ్రేణులతో వరుస సమావేశాలు నిర్వహిస్తున్నారు. తాజాగా పార్టీ సీనియర్ నేతలతో జగన్ తాడేపల్లిలో సమావేశమై రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. ఏయే జిల్లాల్లో ముఖ్య నాయకులు పార్టీ వీడారు, రానున్న రోజుల్లో పార్టీని వీడనున్న నేతలు ఎవరనే విషయాన్ని జగన్ సీనియర్లను అడిగి తెలుసుకున్నట్లు తెలుస్తోంది. వీలైనంతవరకు పార్టీని వీడకుండా ఉండేందుకు చర్యలు తీసుకోవాలని సూచించినట్లు సమాచారం. మరోవైపు పార్టీలో మండలస్థాయి నాయకుల నుంచి జిల్లా స్థాయి నాయకుల వరకు చాలామంది అసంతృప్తితో ఉన్నారనే విషయాన్ని నాయకులు జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. సీనియర్ నేతలు కొందరు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని, దీంతో క్షేత్రస్థాయి కేడర్ సైతం ముందుకు రావడం లేదని చెప్పగా.. ద్వితీయ శ్రేణి నాయకత్వాన్ని ప్రోత్సహించాలని, యాక్టివ్‌గా ఉండే నాయకులకు పార్టీలో పదవులు ఇద్దామని జగన్ చెప్పినట్లు చర్చ జరుగుతోంది. అదే విధంగా పార్టీ అంతర్గత వ్యవహారాలపై సీనియర్ నేతలతో జగన్ చర్చించారట. కూటమి ప్రభుత్వంపై విమర్శల



విషయంలో వేగం పెంచాలని జగన్ సీనియర్ నేతలతో చెప్పినట్లు తెలుస్తోంది. ప్రజల్లో ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగేలా అవసరమైతే అసత్య ప్రచారానికి వెనుకాడవద్దని దిశానిర్దేశం చేశారనే ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతానికి కూటమి ప్రభుత్వంపై ప్రజలు సంతృప్తిగానే ఉన్నట్లు వైసీపీలోనే కొందరు సీనియర్ల చర్చించుకుంటున్న నేపథ్యంలో.. ప్రభుత్వాన్ని టార్గెట్ చేయాలని, ప్రభుత్వం ఏర్పడి ఆరు నెలలు కాకపోయినా హామీల విషయంలో విఫలమైందనే విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని జగన్ చెప్పారట. లడ్డూ వివాదంలో వైసీపీ ప్రభుత్వంపై వ్యతిరేకత పెరిగిన నేపథ్యంలో.. ఈ వివాదంలో కూటమి ప్రభుత్వాన్ని దోషిగా చూపించే ప్రయత్నం చేయాలనే విషయం చర్చించినట్లు తెలుస్తోంది.సార్వత్రిక ఎన్నికల్లో జగన్ అవలంభించిన విధానాలు, వైఖరి కారణంగానే ప్రజలు ప్రతిపక్ష హెూదా లేకుండా 11 సీట్లకు పరిమితం చేసినప్పటికీ వైసీపీ అధ్యక్షుడి తీరు మారనట్లు తెలుస్తోంది. వైసీపీ అరాచక పాలనకు స్వస్తి పలకాలనే ఉద్దేశంతో ప్రజలు కసిగా ఓటు వేసినట్లు ఎన్నికల ఫలితాలు స్పష్టంచేశాయి. ఇప్పటికైనా తీరు మార్చుకుని.. విపక్ష పార్టీగా నిర్మాణాత్మక పాత్రను పోషించాల్సి ఉండగా.. ఆ విధమైన ప్రయత్నం చేయడం మానేసి కూటమి ప్రభుత్వంపై అసత్యాలు ప్రచారం చేయడం ద్వారా ప్రజల దృష్టిని మరల్చేందుకు ప్రయత్నం చేస్తున్నట్లు తెలుస్తోంది. జగన్ వైఖరి నచ్చక ఎంతోమంది సీనియర్ నేతలు, మాజీ మంత్రులు వైసీపీని వీడినా.. జగన్ తన తప్పులను సరిదిద్దుకోకుండా పాత పద్ధతులతోనే ముందుకెళ్తున్నట్లు పార్టీ నాయకులే చర్చించుకుంటున్నారు.